
సుధీర్‌రెడ్డి (ఎల్బీ నగర్)


ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్)


కాలె యాదయ్య (చేవెళ్ల)


గాంధీ (శేరిలింగంపల్లి)


ప్రసాదరావు (వికారాబాద్)


మనోహర్‌రెడ్డి (తాండూరు)


మల్‌రెడ్డి (ఇబ్రహీంపట్నం)


కసిరెడ్డి (కల్వకుర్తి)


శంకరయ్య (షాద్‌నగర్)


రామ్మోహన్‌రెడ్డి (పరిగి)

## కొలువుదీరిన కొత్త సభ్యులు

నూతనంగా ఎన్నికైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలతో శనివారం ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రజల విశ్వాసాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా, వారి అవసరాలకనుగుణంగా పనిచేస్తామని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని వారు ప్రతిజ్ఞ చేశారు.


సబితారెడ్డి (మహేశ్వరం)

## రంగారెడ్డిజిల్లాలో 8 ఆర్టీసీ డిపోల పరిధిలో సేవలు

షాబాద్, డిసెంబర్ 9 : రంగారెడ్డిజిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో మొత్తం 8 ఆర్టీసీ డిపోల పరిధిలో మహిళలకు ఉచిత ప్రయాణ సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, హయత్‌నగర్–1, హయత్‌నగర్–2, బండ్లగూడ, మిధాని తదితర డిపోల పరిధిలో మహిళల ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వంచే జారీ చేయబడిన ఏదైనా ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని అధికారులు మహిళలకు సూచిస్తున్నారు.

# బస్.. జోష్

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని శనివారం నుంచి అమల్లోకి తెచ్చింది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో లాంఛనంగా ప్రారంభించడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉమ్మడి జిల్లాలో కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఆర్డినరీ, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో తెలంగాణలోని ఏ ప్రాంతానికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. అందుకనుగుణంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్సు డిపోల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని ఇప్పటికే ఆయా డిపో మేనేజర్లకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మహిళా ప్రయాణికులు తమకు సంబంధించిన ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉపాధి హామీ కార్డు తదితర గుర్తింపు కార్డులను కండక్టర్‌కు చూపించి ఉచితంగా ప్రయాణించారు. వారికి కండక్టర్లు జీరో టికెట్లను జారీ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం పట్ల మహిళలు హర్షం వ్యక్తంచేశారు.

- బొంరాస్‌పేట/షాబాద్, డిసెంబర్ 9

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- అందుబాటులోకి వచ్చిన మహాలక్ష్మి పథకం
- ఉమ్మడి జిల్లాలో ఆర్డినరీ, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో శనివారం నుంచే అమలు

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మహాలక్ష్మి పథకం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

వికారాబాద్, డిసెంబర్ 9 : ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా జిల్లాలోని ప్రభుత్వ యంత్రాంగం పకడ్బందీగా పని చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. శనివారం వికారాబాద్ ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో భాగంగా మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం), చేయూత (రాజీవ్ ఆరోగ్యశ్రీ ) పథకాలను కలెక్టర్ వైద్య ఆరోగ్య, రవాణా శాఖ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి (ఉచిత టికెట్) పథకాల గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. తెలంగాణ మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లు వయసుతో సంబంధం లేకుండా రాష్ట్ర పరిధిలో ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ పేర్కొన్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, పట్టణ ప్రాంతాల్లో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో కూడా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. మహిళా సాధికారతకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

పేదలందరికీ ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు చేయూత పథకం ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షలు వైద్య ఆరోగ్య సహాయం ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆరోగ్య తెలంగాణ దిశగా అన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంపానల్డ్ ఆసుపత్రిలో తక్షణమే అమలు చేస్తారని వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మేమున్నాం అనే భరోసా ద్వారా ఆరోగ్యశ్రీ కింద 1,672 రోగాలకు వైద్య సహాయం అందజేస్తున్న దృష్ట్యా, ప్రజల్లో ఈ పథకంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆస్తులను అమ్ముకోకుండా బాధ్యత తీసుకోవలసిన అవసరం మనందరిపై ఉందని కలెక్టర్ గుర్తు చేశారు.

కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్, డీసీహెచ్‌ఎస్ ప్రదీప్‌కుమార్, సీడీఆర్‌ఎంవో సుధాకర్ షిండే, జీసీహెచ్ సూపరింటెండెంట్ రామచంద్రయ్య, రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి వీరేశం, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ రాజు, డిపో మేనేజర్ బాక్షినాయక్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి, మహిళా సంఘం నాయకురాలు రత్నమ్మతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు, ప్రయాణికులతో పాటు కలెక్టర్, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తగడి వరకు బస్సులో ప్రయాణం చేశారు.



## మూడు డిపోలు 226 బస్సులు

వికారాబాద్ జిల్లాలో మూడు ఆర్టీసీ డిపోలుండగా వీటిలో 226 బస్సులు ఉన్నాయి. తాండూరులో 86.. 24 ఎక్స్‌ప్రెస్‌లు, ఐదు డీలక్స్ బస్సులు, 57 ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులున్నాయి. ప్రతిరోజూ 23 రూట్లలో 33 వేల కిలోమీటర్ల దూరం బస్సులు తిరుగుతాయి. నిత్యం బస్సుల్లో 30 వేల మంది ప్రయాణిస్తుంటారు. వికారాబాద్ డిపోలో 65.. ఒక ఎక్స్‌ప్రెస్, మిగతా 64 ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులున్నాయి. ప్రతిరోజూ 20 రూట్లలో 24 వేల కిలోమీటర్ల దూరం బస్సులు తిరుగుతాయి. రోజూ సగటున 26 వేల మంది ప్రయాణిస్తుంటారు. పరిగిలో 75.. 26 ఎక్స్‌ప్రెస్‌లు, 49 ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులున్నాయి. ప్రతిరోజూ 22 రూట్లలో 30 వేల కిలోమీటర్ల దూరం తిరుగుతుంటాయి. నిత్యం బస్సుల్లో సగటున 30 వేల మంది ప్రయాణిస్తుంటారు. ప్రయాణికుల్లో 55 శాతం మహిళలే ఉంటారని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ లెక్కన ప్రతిరోజూ జిల్లాలో సుమారు 45 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## ఆటో డ్రైవర్ల ఆందోళన

ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని అందుబాటులోకి తేవడంతో ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో వేల మంది ఆటోలు నడుపుకొంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం కలగడంతో ఆటోల్లో ఎవరూ ఎక్కరని, ఇది తమ జీవనోపాధికి గండి కొడుతుందని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




## మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ భారతి హోలీకేరీ

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 9 : రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ భారతి హోలీకేరీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ అమలు చేసిన రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాలను జిల్లా స్థాయిలో అధికారులతో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. జిల్లా పరిధిలోని కొండాపూర్ ఏరియా దవాఖాన వద్ద రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ముందుగా ప్రాంభించిన ఆమె అనంతరం మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కలిగిన ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. మహిళలు, విద్యార్థినులు, బాలికలతో కలిసి కొంత దూరం జీరో ఫేర్‌తో కూడిన మహాలక్ష్మి టికెట్‌తో బస్సులో ఉచితంగా ప్రయాణం చేశారు. దీంతో పరిసరాల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఉచిత బస్సు ప్రయాణం పట్ల మహిళలు హర్షాతిరేకాలు వ్యకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సాధికారతకు మహాలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచారన్నారు. దీంతో ఎంతో మంది పేదలకు లబ్ది చేకూరుతుందన్నారు. 1672 రకాల రోగాల చికిత్సలు ప్రజలకు వర్తిసాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకం హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఆదర్శంగా నిలువనుందని తెలిపారు. ఈ పథకం ద్వారా పేదలకు లబ్ధి చేకూరడంతో పాటు ప్రభుత్వ దవాఖానలు బలోపేతమవుతాయన్నారు. వైద్యులు, సిబ్బందికి తగిన ప్రోత్సాహం అందుతుందన్నారు. దవాఖానలు బలోపేతమవుయన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ, ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వయసుతో సంబంధం లేకుండా మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఉప వైద్యాధికారులు సృజన, రాజు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ నరేశ్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ప్రవీణ్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, దవాఖాన సిబ్బంది, ఆశావర్కర్లు, ఆర్టీసీ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎవరు మంచి చేసినా బాగానే ఉంటుంది



ఎవరు మంచి చేసినా బాగానే ఉంటుంది. కొడంగల్ నుంచి బస్ చార్జీ లేకుండా ఫ్రీగా వచ్చాను. మొయినాబాద్‌కు బతుకు దెరువు కోసం వచ్చాం. నెలకు రెండుసార్లు ఊరికి వెళ్తాం. పోవడానికి, రావడానికి రూ.300 అవుతుంది. నా బిడ్డ నేను ఇద్దరం ఊరికెళ్లి మళ్లీ మొయినాబాద్ వచ్చాం. ఇద్దరికి కలిపి రూ.3 వందలు మిగిలాయి. ఆధార్ కార్డు చూపించి బస్‌లో ఫ్రీగా వచ్చాము. చాలా సంతోషంగా ఉంది. ఉన్నవాళ్ల ఆడపిల్లలు బస్‌లో ఎక్కరు. పేదోళ్లు మాత్రమే ఎక్కుతారు. పేదోళ్లకు ఇది చాలా మంచిది.

- బాలమ్మ, కొడంగల్, వికారాబాద్